# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఎన్నికల అనంతరం సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చేలా ఓటర్లను నమోదు చేయడాన్ని అన్ని రాజకీయ పార్టీలు నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది.**
2. **ఎన్నికల పోలింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 46 వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**
3. **వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు.**
4. **లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈరోజు విడుదల చేస్తారు.**
5. **తెలంగాణాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువును రేపటి వరకు పొడిగిస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది.**

==========================

ఎన్నికల అనంతరం సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చుతామని ప్రలోభాలతో, ఓటర్ల పేర్లను ప్రైవేటుగా నమోదు చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని దేశంలోని అన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. ప్రకటనలు, సర్వేలు లేదా యాప్ ద్వారా ఓటర్ల నమోదుకు సంబంధించిన కార్యకలాపాలను ఆపివేయాలని స్పష్టం చేసింది. ఎన్నికల అనంతర ప్రయోజనాలను ప్రోత్సహించడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు ఆటంకం ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. ఎన్నికల నియమావళి ప్రకారం ఇటువంటి కార్యక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించింది.

---------------------------

ఈ నెల 13 వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్ర ప్రదేశ్ లో 4 కోట్ల 14 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు . విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పోలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 15 వందల మంది ఓటర్లు ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్ల సంఖ్య 15 వందల దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు

చేస్తామని , 224 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని వివరించారు. 14 సెగ్మెంట్లలో వంద శాతం వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ 14 సెగ్మెంట్లలో భద్రత కూడా పెంచుతామని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఓటర్లు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని, మొత్తం ఓటర్లలో మూడు శాతం మంది, 28 వేల 591మంది మాత్రమే ఇంటి నుండి ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్నారని ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.

---------------------------

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఉదయం నరసాపురం పార్లమెంట్ పరిధిలోని నరసాపురం స్టీమర్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారు. అనంతరం ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని కనిగిరిలో పామూరు బస్ స్టాండ్ సెంటర్లో జరిగే ప్రచార సభలో జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈరోజు విడుదల చేయనున్నారు. ఈ ఉదయం ముఖ్యమంత్రి మ్యానిఫెస్టోను ఆవిష్కరించనున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. విభజన హామీల అమలు, ప్రత్యేక కారిడార్లు వంటి తదితర అంశాలు ఉంటాయని తెలిపారు. కాగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ న్యాయ్ పత్ర పేరుతో మ్యానిఫెస్టోను ఇప్పటికే విడుదల చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ భూహక్కు చట్టంపై ఎటువంటి సందేహాలు వద్దని, భూ హక్కు దారులకు ప్రయోజనం కలిగేలా చట్టం ఉంటుందని వైయస్సార్ సీపీ నేత, విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టంపై ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, దళారి వ్యవస్థ ప్రమేయం లేకుండా ఈ చట్టం తెస్తున్నామని చెప్పారు. ప్రజల ఆస్తులకు మరింత రక్షణ కల్పించాలనేది తమ లక్ష్యమని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువును రేపటి వరకు పొడిగిస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు నిన్న ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో ప్రకటించిన గడువు నిన్నటితో ముగియడంతో విద్యార్థుల వినతి మేరకు ఆ గడువును రేపటి వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుండి జూన్ 3 వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయి.

---------------------------

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల విషయంలో పారదర్శకంగా,

నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కేంద్ర ఎన్నికల సంఘ సీనియర్ డిప్యూటీ ఎన్నికల అధికారి నితీశ్ వ్యాస్ స్పష్టం చేశారు. ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల ఏర్పాట్లపై దృశ్యమాధ్యమం ద్వారా నిన్న సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ కోసం నైపుణ్యం కలిగిన అధికారులను నియమించాలని, పోలింగ్ ప్రారంభానికి 72 గంటల ముందు నుంచి అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో కొన్ని శాసనసభ నియోజక వర్గాలలో అదనపు బలగాలను మోహరించాలని సూచించారు.

---------------------------

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆంధ్ర ప్రదేశ్ లో ఈ నెల 7, 8 తేదీలలో జరపనున్న పర్యటన ఖరారైంది. రాజమండ్రి, అనకాపల్లి, రాజంపేట, విజయవాడ పార్లమెంటుపవన్ స్థానాల పరిధిలో నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు . గుంటూరు జిల్లా మంగళగిరిలో కూటమి నేతలు సిద్ధార్థ నాథ్ సింగ్, బి.జె.పి., తెలుగు దేశం పార్టీల అభ్యర్థులు నిన్న సమావేశమై ప్రధాని పర్యటన ఏర్పాట్ల గురించి చర్చించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు దేశం , జన సేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో బాధ్యతగల, జవాబుదారీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని జన సేన అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కాపాడడమే తమ ప్రథమ కర్తవ్యమని అన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా కలిసికట్టుగా ఈ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పవన్ కళ్యాణ్ కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో నిన్న పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని శంకుస్థాపనలకే టిడిపి, వైసీపీ ప్రభుత్వాలు పరిమితం చేశాయని విమర్శించారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం పై పార్లమెంటులో ప్రస్తావించలేదన్నారు. ఆర్‌టిపిపిని కూడా ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు.

---------------------------

ఎండల తీవ్రత దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ సమయాన్ని పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని తెలుగు దేశం పార్టీ కోరింది. తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు కనకమేడల రవీంద్ర కుమార్ ఎన్నికల సంఘానికి నిన్న లేఖ రాస్తూ మధ్యాహ్నం పూట రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, అందువల్ల ప్రస్తుతం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వున్న పోలింగ్ సమయాన్ని మరొక గంట పెంచాలని కోరారు. తెలంగాణా రాష్ట్రంలో పోలింగ్ సమయాన్ని పెంచినట్టే ఆంధ్రప్రదేశ్ లో కూడా పెంచాలని, దీనివల్ల పోలింగ్ శాతం పెరుగుతుందని ఆ లేఖలో కనక మేడల రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.

---------------------------

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అమూల్యమైనదని ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఓటింగులో మహిళల భాగస్వామ్యం పెంచేలా ఓటరు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిన్న సాయంత్రం ఒంగోలు చర్చి సెంటర్‌లో మహిళా నోడల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని దేశాలలో మహిళలకు ఓటు హక్కు లేని రోజుల్లోనే దేశంలో మహిళలకు కూడా రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, దీనిని గమనించి అర్హులైన మహిళలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలలో శాంతి భద్రతల పరిరక్షణకు నిష్పక్షపాతంగా, నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వహించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సాయుధ బలగాల అధికారులకు సూచించారు. బాపట్ల జిల్లాలో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే సంబంధిత అధికారులతో ఎస్పీ నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన విధుల గురించి దిశానిర్దేశం చేశారు.

========================